అబ్బాయి అంటే ఇలానే ఉండాలి, అమ్మాయి అంటే ఇలానే ఉండాలి.. అనే లక్ష్మణరేఖ సమాజంలో బలంగా ఉంది. అప్పుడప్పుడూ 'ఆడంగి, కొజ్జా' అనే పిలుపులు దాడి చేసేవి. వీధిలో స్నేహితులే కాదు, తరగతి గదిలో టీచర్లూ హేళన చేసేవారు. 'నాన్నా! నన్ను బడిలో ఆట పట్టిస్తున్నారు. గేలి చేస్తున్నారు' అని తండ్రికి ఫిర్యాదు చేసినా.. ఫలితం ఉండేది కాదు. పుండు మీద కారం చల్లినట్టు 'ఆడంగోడిలా ఉండటం మానేయ్ ముందు' అంటూ కన్నతండ్రి ఉచిత సలహాలు ఇచ్చేవాడు. అంతే కానీ, 'అవునా! నిన్ను అట్లంటున్నారా? పిల్లలను దండిస్తా. టీచర్‌తో మాట్లాడతా!' అని ఎప్పుడూ అన లేదు. బిడ్డకు ధైర్యమూ చెప్పలేదు. టీనేజ్‌లోకి వచ్చాక తన లైంగిక ఆసక్తికి తగినట్లుగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు సంపత్. దీంతో అతనిపై అన్ని విధాలుగా నియంత్రణ మొదలైంది.

సామాజిక జీవితంలో కుల, మత వివక్షకు గురైనవారు తమ బాధలు చెప్పుకొంటే.. వినేవాళ్లు ఉంటారు. కుటుంబమూ అండగా నిలబడుతుంది. కానీ, సంపత్‌కు ఇంటా బయటా వివక్షే. ఇంకెవరికి చెప్పుకోవాలి? ఇష్టమైనట్టు ఉండలేక, ఇష్టంలేని రీతిలో నడుచుకోలేక సంపత్ ఇల్లు వదిలి పారిపోవాల్సి వచ్చింది. తనకంటూ ఓ ఇల్లు ఉండాలనేది ప్రతి ఒక్కరి కోరిక. ఇల్లు లేకపోతే మనిషికి తలదాచుకునేందుకు నీడే కాదు, చిరునామా కూడా ఉండదు. చదువు, ఉద్యోగం, వ్యాపారం, వివాహం.. జీవితం ఎంత ఎదిగినా వెచ్చగా తల దాచుకునేందుకు ఒక గూడు ఉండాల్సిందే. అద్దె ఇంట్లో ఉందామనుకుంటే.. 'మీలాంటి వాళ్లకు ఇవ్వలేం' అని ముఖం మీదే చెప్పేవారు యజమానులు. ఇక ఎక్కడ తలదాచుకోవాలి? లెస్బి యన్, గే, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు.. వివక్షను ఎదుర్కో లేక ఇల్లు విడిచి బయటికొస్తే.. సమాజంలో బతకడం ఇంకా కష్టమవుతుంది. సంపత్ విషయంలో కూడా అదే జరిగింది. తనకు ఇష్టమైన ప్రపంచంలోకి వచ్చాక తన పేరు కూడా మారిపోయింది. సిమ్రాన్ (మార్చిన పేరు)గా కొత్త జీవితం మొదలైంది. తన కష్టం తెలిసిన మరో ట్రాన్స్ ఉమెన్ దగ్గర తలదాచుకుంటూ.. నచ్చిన దుస్తులు ధరిస్తూ.. నచ్చిన రీతిలో బతుకుతూ కొత్త జీవితం ప్రారంభించారు సిమ్రాన్. నాలుగు రోజులు తిండి పెట్టిన వాళ్లే నువ్వూ ఏదో ఒక పని చూసుకోవా లని మొహం మీదే చెప్పారు. కానీ ఎవరూ ఉద్యోగం ఇవ్వలేదు. సర్టిఫికెట్లు లేకుండా ఎవరిస్తారు? ఇల్లు విడిచేటప్పుడు అందనంత దూరం వెళ్లిపోవాలనే ఆత్రుత తప్పిస్తే.. రేపటి రోజు ఎలా ఉంటుందనే ఆలో చన చేయలేదు తను. సర్టిఫికెట్ల కోసం ఇంటికి వెళ్తే.. బయటికి రావడం కష్టం. ఉద్యోగం రాక, ఉపాధి లభిం చక.. మిగతా ట్రాన్స్‌జెండర్స్‌లానే తానూ భిక్షాటన చేయాల్సి వచ్చింది. మండే ఎండలు, దుమ్ము, ధూళి భరిస్తూ.. ఆత్మాభిమానం చంపుకొని.. యాచన చేయడం తనకు కష్టమనిపించింది. గౌరవప్రదమైన జీవితం కోసం కలలు కనేవారు. అప్పుడే సిమ్రాన్‌కు ఎవరో ఓ అడ్రస్ పేపర్ ఇచ్చారు. దాని మీద 'క్వీర్ ట్రాన్స్ వెల్‌నెస్ అండ్ సపోర్ట్ సెంటర్ (క్యూటీ సెంటర్), హైదరాబాద్ (హబ్సీగూడ)' అని ఉంది. ఆ సంస్థ నిమ్న లైంగిక వర్గాల వాళ్లకు నీడనివ్వడమే కాదు, కొండంత అండగా ఉంటుందని ఆ అడ్రస్ ఇచ్చినవారే చెప్పారు. సిమ్రాన్ ఆ కార్యాలయం తలుపు తట్టారు. అక్కడి సైకాలజిస్టులతో మనసు విప్పి మాట్లా డారు. ఆ మాటల్లోనే తన కథంతా చెప్పారు. మనసు విప్పింది. కన్నీళ్లు ప్రవహించాయి. ఎక్కిళ్లు వెక్కిరిం చాయి. మధ్యమధ్యలో నిశ్శబ్దం. మాటలకందని భావా లను వెల్లడించింది.

బాల్యంలో ఎదురైన అవమానాలు.

హింస. భౌతిక దాడులు. మాటల కొరడా దెబ్బలు.

బతుకు చుట్టూ అల్లుకున్న చీకటి.

ఎక్కడా వదిలిపెట్టకుండా..

తన ప్రయాణమంతా వివరించారు సిమ్రాన్.

ఆ నిపుణులు సావధానంగా విన్నారు.

అందమైన జీవితం నిర్మించుకోవడం ఎలాగో చెప్పారు. అలా సిమ్రాన్ క్యూటీ సెంటర్లో కొన్నాళ్లు తల దాచుకున్నది. మంచి ఆహారం, ఆహ్లాదకరమైన పరిస రాలు, అర్థం చేసుకునే స్నేహితులు, గౌరవించే మను షుల మధ్య సిమ్రాన్ కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు. ప్రేమ, ఆప్యాయతల మధ్య.. అంతకాలం తాను కోల్పో




## కొత్త బంగారు లోకం

జీవితమంటే ఉద్యోగం, సంపాదనే కాదు. సామాజిక జీవితం కూడా కావాలి. అందరితో సమానంగా బతికే అవకాశాలు కావాలి. అవేవీ ఎల్‌జీబీటీ వ్యక్తులకు లేవు. పార్కుకు పోతే అందరిలా కాలక్షేపం చేయ లేరు. హేళనలు, అనుమానాలు తప్పవు. అసలు సెక్యూరిటీ సిబ్బంది కూడా అనుమతించరు. కాఫీ షాపుల్లో కూర్చుంటే, ఇరానీ కేఫుల్లో ముచ్చటపెడితే ఒప్పుకొనే సమాజం కానే కాదు మనది. కొన్ని సౌకర్యాలు అను భవించాలంటే.. చేతిలో డబ్బు ఉంటే సరిపోదు. సమాజం అనుమతి కూడా అవసరం అని ఇలాంటి వాళ్ల జీవితాల్లోకి తొంగి చూస్తే అర్థమవుతుంది. పుట్టిన రోజు జరుపుకొంటానంటే ఫంక్షన్ హాల్ ఇవ్వరు. మీటింగ్ పెట్టుకోడానికి పోలీసుల అనుమతి లభించదు. కుటుంబాలకు దూరమైన జీవితాలకు పండుగలు, వేడుకలు తెలియవు. ఆ బతుకులకు కొద్దిపాటి సంతోషాన్ని అందిస్తున్నది.. క్యూటీ సెంటర్. ఇదో చిన్నపాటి ప్రపంచం. ఇక్కడ సంతోషంగా గడపవచ్చు. చదువుకోవడానికి బోలెడు పుస్తకాలు ఉంటాయి. కంప్యూటర్లు, ఇంటర్నెట్ సదుపాయాలు ఉన్నాయి. జీవన నైపుణ్యాలు కూడా నేర్పిస్తారు. అప్పుడప్పుడూ వీళ్లే నాటకాలు వేస్తారు. ఆర్ట్ వర్క్‌షాప్, ఆర్ట్ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తారు. ఆ మధ్య సిమ్రాన్ ఎల్‌జీబీటీ కమ్యూనిటీతో కలిసి తన పుట్టిన రోజు ఘనంగా జరుపుకొన్నారు. చిన్నప్పుడు అమ్మానాన్నతో కలిసి వేడుక జరుపుకొన్న రోజులు గుర్తుకొ చ్చాయి తనకు. కొత్త స్నేహితుల మధ్యలో.. కొత్త ప్రపంచం నీడలో.. జీవన నైపుణ్యాలు పెంచుకుంటూ కెరీర్‌ని నిర్మించుకున్నారు సిమ్రాన్.

